క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినెల రెండో ఆదివారం స్పెషలిస్టులతో ఉచితవైద్య శిబిరాల్లో భాగంగా ఏప్రిల్ నెల రెండో ఆదివారం 13న ఎండోక్రైనాలజీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్ .హెచ్. ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ నందిపాటి వెంకట సందీప్ పాల్గొంటారన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా బీజేపీ కృషి

గుంటూరు మెడికల్: గుంటూరు ఈస్ట్ 6వ మండలం 'గావ్ చలో అభియాన్' కార్యక్రమం బీజేపీ నాయకులు శనివారం నిర్వహించారు. ఈస్ట్ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ పాల్గొన్నారు. నాజ్ సెంటర్‌లోని మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ శనక్కాయల ఉమశంకర్ మాట్లాడుతూ బీజేపీ వికసిత్ భారత్ ధ్యేయంగా అంత్యోదయ సిద్ధాంతానికి కట్టుబడి ఉందన్నారు. స్థానిక ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ సందర్శించి అక్కడ మౌలిక సదుపాయాలు గురించి, ఉచిత ఔషధాల పంపిణీ గురించి తెలుసుకున్నారు. సెంటర్‌కు అవసరమైన మెడిసిన్ స్టోరేజ్ రాక్స్‌ను పార్టీ 6వ మండల నాయకులు మైలవరపు ప్రవీణ్, వేమూరి అనిల్ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మలిశెట్టి పవన్ కుమార్, నాయకులు సురేష్ కుమార్ జైన్, రామకృష్ణ, మోతె శేషగిరి, వేమూరి అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా గావ్ చలో అభియాన్...

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పల్లెకు పోదాం చలో (గావ్ ఛలో అభియాన్) కార్యక్రమం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి తానుచింతల అనిల్ పాల్గొన్నారు. స్థానిక అరండల్ పేటలోని శ్రీ మోహన రంగనాయక స్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గుడి ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చేగు నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీకృష్ణ చైతన్య, కార్యదర్శి మాజేటి నాగమనోహర్, భజరంగ్ రామకృష్ణ, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్, మంత్రి సుగుణ, పద్మనాభుని రమాదేవి, శివరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చేపట్టారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీ గణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేత



నెహ్రూ నగర్: పేదలు, దివ్యాంగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ పిలుపునిచ్చారు. మానవత పరిచర్య సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమ్ జ్యోతి బాబు ఆధ్వర్యంలో నల్ల చెరువులో దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తిప్పా బత్తిన గోవింద్, శరత్ బాబు, పాస్టర్ ఎం.శ్యాంసుందరరావు, ప్రభు మనోహర్ పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు కొండా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. పంచకర్మ, అనుభవం కలిగిన వైద్య బృందంతో పరీక్షలు నిర్వహించి మందులు అందజేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

చీకట్లో ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్..!

- రూ.25 లక్షలతో అభివృద్ధి సాధ్యమేనా..
- అస్తవ్యస్తంగా స్విమ్మింగ్ పూల్ నిర్వహణ
- కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలం



శ్యామలానగర్‌లోని ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్‌లో సరిపడ లైట్లు లేక చీకటి మయం

లక్ష్మీపురం: ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్‌లో చీకట్లు కమ్ముకున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆధునికీకరణ పనులు చేపట్టిన ఫలితం లేకుండా పోయింది. పూల్‌కు వచ్చే వారికి తగిన వసతులు కల్పించడంలో కార్పొరేషన్ విఫలమవుతోంది. వేసవి సీజన్‌లో అత్యధిక మంది వచ్చే అవకాశం ఉన్నా దానికి అనుగుణంగా వసతులు కల్పించడం లేదు.

నగరంలో ప్రసిద్ధి చెందిన ఎన్టీఆర్ స్విమ్మింగ్‌పూల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తోంది. మరమ్మతులకు గురైంది. టైల్స్ పగిలి పోయి, ప్రాంగణం చుట్టు పిచ్చి మొక్కలు, వంటి పలు సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేషన్ రూ.25 లక్షలు మంజూరు చేసింది. పూల్ అభివృద్ధి కోసం గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన పూర్తిగా నిలిపివేశారు. అనంతరం తిరిగి పూర్తిగా పనులు చేసి ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీన ఎమ్మెల్యే గల్లా మాధవి, నగరపాలక సంస్థ కమిషనర్ పునఃప్రారంభించారు. నాసిరకంగా పనులు చేపట్టడంపై క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేసిన పనులు ఇవే...

స్విమ్మింగ్ పూల్‌లో టైల్స్ మార్చడం, పూల్ చుట్టు ఉన్న పగిలిన టైల్స్‌కు బదులుగా గ్రానైట్ వేశారు. కాని పూల్ చుట్టూ ఒక వైపు మాత్రమే లైట్లు వెలుగుతున్నాయి. రెండో వైపు లైట్లు వెలగడం లేదు. అయితే ఇటీవల లైట్లు తీసుకొచ్చి అలంకార ప్రాయంగా పెట్టారు కాని వాటిని బిగించడానికి ఇంకా సమయం రాలేదు. అలాగే పూల్ వాటర్ ప్యూరీపై అయ్యే భవనం శిథిలావస్థకు చేరింది. వర్షంనీరు కారుతుండటంతో ఒక చిన్నపాటి సిమెంట్‌తో స్లాబ్‌పై మరమ్మతులు చేసి పెయింటింగ్ చేశారు. డ్రస్సింగ్ గదులకు తలుపులు మార్చకుండా వాటినే తూతూ మంత్రంగా మరమ్మతులు చేశారు. షవర్ చేసిన నీరు బయటకు వేళ్లేందుకు ఉన్న చిన్న రంధ్రంపై స్టీల్ ప్లేటును నిర్మించడం మరిచారు. అలాగే షవర్ చేసే ప్రదేశంలో లైట్లు వేయడం కూడా మరిచారు. పూల్‌కు వచ్చే వారి కోసం మూత్ర విసర్జన కోసం ఉండే వాష్ రూమ్‌లో కూడా లైట్లు లేవు. వాష్‌రూమ్‌లో ఉండే వాష్‌బేషన్‌ల వాటర్ ట్యాబ్‌లు కూడా పని చేయడం లేదు. సాయంత్రం 7 గంటల తరువాత స్విమ్మింగ్ పూల్ ప్రధాన గేటు నుంచి లోపలికి వెళ్లే సమయంలో లైట్లు లేక అంతా చీకటి మయంగానే ఉంది.

క్రీడాకారుల సంఖ్య పెరుగుతున్నా..

స్విమ్మింగ్‌లో ఇక్కడకు వచ్చేందుకు కార్పొరేషన్ రుసుం వసూలు చేస్తోంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్టేడియం సభ్యులు కాకుండా నెలకు 14 సంవత్సరాలు పై బడిన వారు రూ.1500, 14 సంవత్సరాల లోపు వారు రూ.1200 చెల్లించే వారు. ప్రస్తుతం రెండు వందల మంది వరకు ఉంటారు. వారు కాకుండా సాయంత్రం సమయంలో మరో 50 మంది వరకు వస్తుంటారు. ప్రస్తుతం సమ్మర్ ప్రారంభం కావస్తున్నందున ఈ ఏడాది ఉదయం సాయంత్రం 500 మంది వరకు చిన్నారులు వస్తారన్న అంచనా. కాని అభివృద్ధి చూస్తే అంతంత మాత్రంగానే ఉంది. గతంలో ఎన్.టీ.ఆర్ క్రీడా ప్రాంగణానికి, స్విమ్మింగ్‌పూల్‌కు సెక్యూరిటీ గార్డులు సుమారు 11 మంద ఉండే వారు ప్రస్తుతం మొత్తానికి ముగ్గరు మాత్రమే ఉండటంతో స్విమ్మింగ్‌కు, క్రీడా మైదానికి వచ్చే వారి వాహనలకు భద్రత లేకుండా పోయింది.



ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్ ప్రధాన ద్వారం..

బసవపున్నయ్య చిరస్మరణీయుడు



మాకినేని బసవపున్నయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాశం రామారావు, వై.నేతాజీ

లక్ష్మీపురం: మాకినేని బసవపున్నయ్య ఆశయాలను నేటితరం ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మాకినేని బసవపున్నయ్య వర్ధంతి సందర్భంగా 2/7 బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షతన శనివారం సభ నిర్వహించారు. బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాశం రామారావు మాట్లాడుతూ పేదప్రజల, పీడిత ప్రజల విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీలో చేరారని చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే జిల్లాలో వెంకటపతి, మోటూరు హనుమంతరావు, కొరటాల సత్యనారాయణ, శివారెడ్డి లాంటి నాయకులు ఉద్యమంలో కీలకంగా పనిచేశారన్నారు. వారి స్ఫూర్తితో నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ మాకినేని బసవపున్నయ్య చిన్ననాటి నుండే ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారని తెలిపారు. జిల్లా నుండి తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, మెడికల్ సేల్స్ రిప్రజెంటీవ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకటరావు, అధ్యక్షుడు సి.హెచ్.కుమార్, ఆల్‌ఇండియా ఫెడరేషన్ కార్యదర్శి జి.మోహన్‌రావ్, సీపీఎం జిల్లా నాయకులు వై.కృష్ణకాంత్, కిరణ్, ఖాశింషహీద్, సమీర్ పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న వినయ్

నగరంపాలెం: నిరంతరం సంగీత కళాకారులను ప్రోత్సహిస్తూ, సంప్రదాయ సంగీతాన్ని భావితరాలకు అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శ్రీభక్త జ్ఞానానందతీర్థ (ఓగిరాల వీర రాఘవశర్మ) ఆరాధన సంగీత ఉత్సవం నిర్వహించారు. డాక్టర్ లలిత్‌ప్రకాష్‌చంద్ర, ఆలయ పాలక మండలి నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. విద్వాన్ వినయ్ చేపట్టిన శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. వయోలిన్‌పై గాయత్రీ విభావరి (చెన్నై), మృదంగంపై బీరక సురేష్‌బాబు వాయిద్యాన్ని అందించారు. అనంతరం విద్వాన్ ఎస్.ఆర్. వినయ్ (బెంగళూరు)కి శ్రీభక్త జ్ఞానానంద తీర్థ మెమోరియల్ అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో ఓగిరాల రామకృష్ణ, సంస్థ ప్రధాన కార్యదర్శి ఏం.వై.శేషరాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ లలితాదేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొనగా, కళాకారులను, అతిథులను సత్కరించారు.

బైక్ చోరీలకి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్‌హెచ్‌ఓ వీరయ్య, ముసుగులో నిందితుడు

పట్నంబజారు: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. గుంటగ్రౌండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్యచౌదరి వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన కోట అఖిల్‌కుమార్ గుంటూరు నగరంలోని రైలుపేటలో గొలుసు నాంచారమ్మ హైస్కూలు వద్ద తన స్నేహితులతో కలసి రూము అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అమెజాన్‌లో డెలివరీ బోయ్‌గా పనిచేస్తున్నాడు. సులభతరంగా సంపాదించాలని ఉద్దేశంతో చోరీలు చేయడం ప్రారంభించారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఈనెల 11వ తేదీ రాత్రి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే క్వార్టర్స్ ఎంట్రన్స్ వద్ద ఎస్ఐ డి.రమేష్, సిబ్బందితో వెళ్లగా నిందితుడు పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అఖిల్‌ను పట్టుకుని తమదైన శైలిలో విచారించగా, ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. రూ.12 లక్షల విలువ చేసే 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సుమారు పది కేసులు నిందితుడిపై నమోదు అయినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించారు.

శ్రీహనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, సమాజం సభ్యులు

నగరంపాలెం: హనుమత్ జయంతి సందర్భంగా కొత్తపేట శ్రీహనుమాన్ చౌక్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీహనుమాన్ దీక్షా సమాజం ఆధ్వర్యంలో శ్రీ హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గౌరవాధ్యక్షులు తిరువళ్లూరు వెంకటసుబ్బారావు తెలిపారు. ప్రతి ఏటా భక్తుల సహకారంతో ఈ ఉత్సవాలను చేపడుతున్నామని అన్నారు. కొత్తపేట శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం నుంచి వచ్చేనెల 21 వరకు దేవాలయంలో హనుమాన్ దీక్షాపరులకు భిక్షా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. క్రమంలో స్వామి వారికి ఆగమోక్తంగా గణపతి పూజ, మండపారాధన, మన్యు సహిత పంచ, సూక్త హోవనం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను రుత్వికులతో నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షా సమాజం సభ్యులు నాగేశ్వరరావు, చిత్తజల్లు రమేష్, మారుతి, వెంకటరమణ, వంశీప్రసాద్, బాపిరాజు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన హనుమాన్ దీక్షలు



స్వామికి విశేష ఆకు పూజలు చేస్తున్న అర్చకులు



మాలధారణ చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని కంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో శనివారం చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా వార్షికంగా నిర్వహిస్తున్న హనుమాన్ మండల వ్రత దీక్షలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆంజనేయస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, విశేష ఆకు పూజలు నిర్వహించారు. అనంతరం మండల దీక్షలు మాలధారణ చేశారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై, స్వామి అర్చనలలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అర్ధ మండల దీక్షలు ప్రారంభమవుతాయని, అదే నెల 25వ తేదీ వరకు మండల దీక్షలు నిర్వహిస్తామని కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ తెలిపారు.

డ్రైయిన్‌లో పూడికతీత పనులు వేగవంతం చేయాలి

గుంటూరు రూరల్: నగర పరిధిలో ప్రధాన డ్రైయిన్‌లో పూడికతీత పనులు వేగవంతం చేసి, వెంటనే పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. విద్యానగర్, నగరాలు, గోరంట్ల, రెడ్డి పాలెం తదితర ప్రాంతాలలో శనివారం పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, ప్రధాన డ్రైయిన్లలో సిల్ట్ తొలగింపు పనులు, భవన నిర్మాణ అనుమతులు పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన డ్రైయిన్లతో పాటు అంతర్గత రోడ్లలోని డ్రైయిన్లలోని పూడికతీత పనులు పక్కాగా నిర్వహించాలని కోరారు. వర్షాకాలం రాకముందే నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్ల వెంబడి డ్రైయిన్లలో పూర్తి స్థాయిలో పూడికతీత పనులు పూర్తి చేయాలని చెప్పారు. పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకొని, డ్రైయిన్లపై ఉన్న ర్యాంపులను తొలగించి నూరు శాతం పూడికతీత జరగాలన్నారు. పనులు చేపట్టకముందు, జరిగిన తరువాత ఫొటోలు, స్థానికుల సంతకాల వివరాలు అంచనాలతో పొందుపరచాలని సూచించారు. నగరంలో చెత్తకుప్పలు తొలగింపులో జాప్యంపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, గత వారం నుంచి నైట్ శానిటేషన్ ద్వారా ప్రధాన రోడ్ల శుభ్రం పనులు ప్రారంభించామన్నారు. వార్డులలో ఉన్న చెత్తకుప్పలు కనపడకుండా ఎప్పటికప్పుడు తరలించాలని చెప్పారు. పర్యటనలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, ఏసీపీ రెహమాన్, ఎస్ఎస్‌లు సోమశేఖర్, ఐజాక్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

అన్న క్యాంటిన్‌లలో ప్రతిరోజు నిర్దేశిత సమయంలో ఆహారం అందించాలని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. నగరంలోని బస్టాండ్ వద్ద నున్న అన్నా క్యాంటిన్‌ను పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడారు. అన్నా క్యాంటిన్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఆహారం అందించాలన్నారు.

మత్తు పదార్థాల పై అవగాహన ర్యాలీ



నెహ్రూ నగర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా, వాటికి బానిస కాకుండా సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఈ మారయ్య బాబు పేర్కొన్నారు. శనివారం పొన్నూరు రోడ్డులోని హుస్సేన్ నగర్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలను తాగడం ద్వారా విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల అమ్మకం, వినియోగాన్ని నిర్మూలించడానికి తీసుకోవాల్సిన నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు గుంటూరు– 1 టౌన్ ఎక్సైజ్ స్టేషన్ బి.లత, ఎస్ఐలు షరీఫ్, తిరుమలేశ్వర రావు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఫలితాల్లో 'బాలికల' సత్తా



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గర్నెపూడి సునీత తెలిపారు. శనివారం సాంబశివపేటలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ ప్రథమ సంవత్సర పరీక్షలకు హాజరైన 502 మంది విద్యార్థినుల్లో 261 మంది ఉత్తీర్ణులు కాగా, 52 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసి 401 మంది విద్యార్థినులకు 293 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులవ్వగా, 73 శాతం నమోదైనట్లు వివరించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో పఠాన్ తన్వియ సుల్తానా 978, బైపీసీలో ఎండీ అఫీసా తబసుమ్ 965, పి.దీపిక 963, సీఈసీలో మనీషా కుమారి 952, ఎంఈసీలో ఆర్.రాజేశ్వరి 967, హెచ్ఈసీలో దివ్య ఒలీవా 895 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సర ఎంపీసీలో శ్రీవెంకట శివ లావణ్య 466, రెహానా కౌసర్ 432, సీఈసీలో ఎండీ సాన్య 471, ఎంఈసీలో దివ్యశ్రీ 434, బైపీసీలో ఎన్. సుష్మ 425, డి. సారిక 416, ఎండీ హజరా సాజిత 408 మార్కులు సాధించినట్లు వివరించారు. కళాశాల నుంచి 46 మంది విద్యార్థినులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సునీతతో పాటు అధ్యాపకులు అభినందించారు.

అ'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాతగుంటూరులోని శ్రీపులిపాక కమలా హనుమంతరాయ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1977–78 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఒకనాడు పాఠశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 47 ఏళ్ల అనంతరం తమ సహచరులను కలుసుకున్న ఆనందంలో మునిగితేలారు. అదనపు ఎస్పీగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఐజాక్ ప్రభాకర్ మాట్లాడతూ క్రమశిక్షణతో కూడిన విద్యతోనే తాము జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకున్నామని తెలిపారు. చదువుతోనే కాకుండా వినయ, విధేయతలు, విలువలు నేర్చుకున్న కారణంగా పలువురు సీఎంలకు వ్యక్తిగత కార్యదర్శిగా పని చేసే అవకాశం దక్కిందని పూర్వ విద్యార్థి గుండెపూడి ఆంజనేయ శాస్త్రి గర్వంగా చెప్పుకున్నారు. నాలుగున్నర దశాబ్దాల అనంతరం తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న పూర్వ విద్యార్థులు జీవితంలో తాము సాధించిన విజయాలకు బీజం ప్రభుత్వ పాఠశాలే పడిందని గుర్తు చేసుకున్నారు. చదువే కాకుండా ఆటలు, పాటలు, వ్యక్తిత్వ వికాస అంశాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఉన్నతంగా తీర్చిదిద్దారని హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సెల్వ రాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోపాల్, బద్రి, గుప్త, అబ్రహం లింకన్, సుధీర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎరుకుల జాతి గుండెచప్పుడు ఏకలవ్యుడు



విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు రూరల్: గిరిజన సంస్కృతిలో ఆవిర్భవించిన గొప్ప త్యాగ పురుషుడు, పోరాటయోధుడు ఏకలవ్యుడు అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు తెలిపారు. జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు నగరాలు ఐడీ హాస్పిటల్, రామచంద్ర బ్రదర్స్ ఫర్నిచర్స్ ఎదురు ఏకలవ్యుని విగ్రహావిష్కరణ ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గోరంట్ల సెంటర్ నుంచి అమరావతి రోడ్డు వరకు భారీ ద్విచక్ర వాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకలవ్యుడు తాను నమ్మిన ద్రోణాచార్యుని మట్టి బొమ్మనే గురువుగా ఎంచుకొని ధర్మానికి కట్టుబడి త్యాగ పురుషుడిగా కీర్తి గడించాడన్నారు. పశ్చిమ శాసన సభ్యురాలు గల్లా మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎరుకల సమాజ సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు పెట్టి అమలు చేస్తుందన్నారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ నజీర్‌అహ్మద్ మాట్లాడుతూ రాజకీయంగా గిరిజనుల ఎదుగుదలకు సంఘటితంగా వర్గాలకతీతంగా కలిసి కట్టుగా నడవాలని కోరారు. శాసనమండలి సభ్యులు కుంభ రవిబాబు మాట్లాడుతూ గిరిజనుల రిజర్వేషన్లు ఆరు శాతం రాష్ట్రవ్యాప్తంగా కచ్చితంగా అన్ని స్థాయిలలో అమలు చేసేలా కృషి జరగాలన్నారు. సంఘం అధ్యక్షులు మేడ లక్ష్మయ్య మాట్లాడారు. విజయవాడ ఏఎస్పీ కుంభ కోటేశ్వరరావు, అభివృద్ధి సంఘం ఉపాధ్యక్షులు ఉయ్యాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి తోకల పాపారావు, సహాయ కార్యదర్శి మేడ బ్రహ్మయ్య, కార్యనిర్వహక కార్యదర్శి తోకల రామకృష్ణ, కోశాధికారి కుంభ ఏడుకొండలు, గౌరవ అధ్యక్షులు మేడ హనుమంతరావు , ముఖ్య సలహాదారు, కుంభ వెంకటేశ్వరరావు, సలహాదారులు మేడ నాగేశ్వరరావు, కుంభ వెంకట్రావు, కుంభ సురేష్, కార్యవర్గ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, రాష్ట్ర ట్రైబల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పేరంటాళ్లమ్మ తిరునాళ్లు

వల్లభాపురం(కొల్లిపర): మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలోని శ్రీ సర్విరెడ్డి పేరంటాలమ్మ దేవస్థానంలో అమ్మవారి కల్యాణం మహోత్సవం ,పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు గ్రామంలో మూడు రోజులుగా భక్తులు ఘనంగా నిర్వహించారు.తిరునాళ్లను శనివారం ఆకరి రోజు కావటంతో మండలంలోని అనేక గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తమ కుటుంబసభ్యులతో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి కల్యాణ మహోత్సవం, శిడిమాను మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.మహిళలు పెద్ద ఎత్తున పేరంటాళ్లమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.తిరునాళ్లలలో ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.కోటేశ్వరరావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలోచింప చేసిన అమ్మ చెక్కిన బొమ్మ నాటిక



తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇక్కడి ఓపెన్ ఆడిటోరియంలో ప్రారంభమైన జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీల్లో తొలిగా గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికను ప్రదర్శించారు. విభిన్న ఇతివృత్తంతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. సమాజంలో స్త్రీ లేదా పురుషుడు కానివారిని అవమానంచడం, గౌరవించకపోవటం, అసహ్యించుకోవటం మానవజాతి దిగజారుడుతనానికి ఓ ప్రతీక అనే విషయాన్ని ఈ నాటిక ఎత్తిచూపింది. జ్యోతి రాజ్ భీశెట్టి రచించిన ఈ నాటికను డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వంలో ప్రదర్శించారు. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో ఆరంభమైన ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకట కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com